# దేవుడు క్షమించడు!

"సార్!"

డైనింగ్ టేబులు ముందు కూర్చుని, పేపరు చూస్తున్న జగన్నాథం, పిలుపు వినగానే ప్రక్కకు తిరిగి చూశాడు.

దూరంగా గుమ్మందగ్గర డ్రైవర్ రాబర్ట్ నిలబడి వున్నాడు.

"ఏమిటి? శేషేంద్ర రాలేదా?" - అడిగాడు జగన్నాథం ఆదుర్దాగా.

"అబ్బాయిగారు కనిపించలేదు సార్!" - భయపడుతున్నట్టుగా వుంది అతని స్వరం.

పేపర్ అక్కడే వదిలేసి - చటుక్కున కుర్చీలోంచి లేచి రెండడుగుల్లో రాబర్ట్‌ని చేరుకున్నాడు.

"ఏమిటి... ఏమిటి నువ్వంటున్నది?" - జగన్నాథం స్వరంలో కూడా భయం తొంగి చూసింది... అయితే రాబర్ట్‌ది అసమర్థతతో కూడిన భయమైతే జగన్నాథానిది ఆందోళనతో కూడిన భయం.

"అవున్సార్! నేను స్కూలుకి వెళ్ళిన తర్వాతనే 'బెల్' కొట్టేరు... పిల్లలందరూ బిలబిల మంటూ బయటకు వచ్చారు. అందులో అబ్బాయిగారు కనిపించలేదు."

"వాళ్ళ టీచర్‌ని అడిగావా?" జగన్నాథం కంఠం వణుకుతోంది.

"ఆవిడెవరో తెలియదు సార్... అయినా అక్కడ కనిపించిన వాళ్ళనందర్నీ అడిగేను... అందరూ మాకు తెలీదంటే మాకు తెలీదన్నారు!"

"పద! స్కూలుకి వెడదాం!" చెప్పులైనా తొడుక్కోకుండా గబగబా బయట కొచ్చి కారెక్కాడు జగన్నాథం. పదినిమిషాల్లో కారు కాన్వెంటు స్కూలు దగ్గర ఆగింది.

★ ★ ★

విషయం విన్న తర్వాత - 'లోయర్‌కేజీ' క్లాసులు తీసుకుంటున్న టీచర్లను పిలిపించింది హెడ్‌మిస్ట్రెస్.

"ఈయన 'అరుంధతీ స్పిన్నింగ్ మిల్స్' ప్రొప్రయిటర్ జగన్నాథంగారు! మన స్కూల్లో లోయర్‌కేజీ చదువుతున్న శేషేంద్ర వీరి 'సన్'" ! చెప్పింది హెడ్ మిస్ట్రస్.

శేషేంద్రను లోయర్ కేజీలో చేర్పించిన తర్వాత ఆ స్కూలుకి ఓ గాద్రేజ్ బీరువా రెండు సీలింగ్ ఫాన్లూ డొనేట్ చేశాడు జగన్నాథం. అందుకే ఆయనను హెడ్‌మిస్ట్రెస్ పరిచయం చేయగానే టీచర్లు ఆయనకు వినయ పూర్వకంగా నమస్కారం చేశారు.

"ప్రతిరోజూ పొద్దున్నే మా శేషేంద్రని కార్లో పంపుతుంటాను. మళ్ళీ స్కూలు వదలటానికి పదినిమిషాలు ముందు కారు ఇక్కడకు వస్తుంది.... ఎప్పటిలాగే ఇవాళ కూడా కారొచ్చింది. కానీ స్కూలు వదిలింతర్వాత, శేషేంద్ర స్కూల్లో నుంచి బయటకు రాలేదు" గబగబా చెప్పేడు జగన్నాథం.

"పొద్దున్న పదింటికి మీరు శేషేంద్ర కోసం మనిషిని పంపించారుగా?" - అడిగింది మిస్ లూసీ....

"నో! నేను ఎవర్నీ పంపించలేదే!?" ఖంగారుగా అన్నాడు.

"సరిగ్గా గుర్తుతెచ్చుకోండి సార్! లావుగా పొట్టిగా వున్నాడు. పిల్లిగడ్డం... గుబురుమీసాలు ఖాకీబట్టలు వేసుకున్నాడు!"

లూసీ అలా చెప్తూంటే జరగరానిదేదో జరిగిపోయినట్టు ఫీలవుతున్నాడు జగన్నాథం.

"లేదు! నేనెవర్నీ పంపలేదు!" - శక్తినంతా కూడదీసుకుని చెప్పాడు.

"జరిగినదేమిటో వివరంగా చెప్పండి టీచర్!" హెడ్ మిస్ట్రస్ లూసీని ప్రశ్నించింది...

"నేను పిల్లలకు 'రైమ్స్' చెప్తుండగా ఆ వ్యక్తి క్లాసులోకి వచ్చాడు మేడం... 'శేషేంద్ర బాబు కావాలి' అన్నాడు. 'ఎందుకూ' అని అడిగాను... 'జగన్నాథంగారే తీసుకురమ్మన్నారనీ అతను వాళ్ళ కారు డ్రైవర్ననీ చెప్పాడు... నేను బాబుని అతనితో పంపించాను. శేషేంద్రని అతను కార్లో ఎక్కించుకుని వెళ్ళటం, క్లాసు రూం కిటికీలోంచి నేను కళ్ళారా చూశాను!"

"మా కారు డ్రైవరు రాబర్ట్! మీరెప్పుడూ చూళ్ళేదా?"

"చూశాను సార్!... వచ్చిన వ్యక్తి రాబర్ట్ కాదనీ తెలుసు... కానీ వేరే కారు పంపించారనుకున్నాను...."

"అయితే... ఎవరో మోసం చేశారు... బాబును ఎత్తుకు పోయారు!" అనుకున్నాడు జగన్నాథం. అతని ఎముకల్లోంచి చలి పుట్టుకొస్తున్నట్టుగా వణికి పోతున్నాడు... విశాలమైన అతని ఫాలభాగం చెమటతో చెమ్మగిల్లుతోంది.

పరిస్థితిని అర్థం చేసుకుంది హెడ్‌మిస్ట్రెస్.

"ఎవరో వచ్చి పంపమంటే - పంపించేయటమేనా? కనీసం నా నోటీసు కైనా తేవద్దా?" - లూసీని ప్రశ్నించింది.

"సారీ మేడం! శేషేంద్ర కార్లో వస్తుంటాడు కనుక - అతని కోసం జగన్నాథంగారే అవసరం వచ్చి కారు పంపించారనుకున్నాను. పైగా అతను డ్రైవరులాగా కనిపించాడు. ఇది చాలా మామూలు విషయం అనుకున్నానే గానీ - ఇందులో ఏదో మోసం వుందని గ్రహించలేక పోయాను!" బెదురుతూ చెప్పి తలవంచుకుంది లూసీ.

"ఇప్పుడెలా?" - కర్చీఫ్‌తో నుదుటిమీద చెమట తుడుచుకుంటూ అన్నాడు జగన్నాథం... అతని ముఖం పూర్తిగా పాలిపోయింది.

"అధైర్య పడకండి సార్... మీరు ఇంటికి వెళ్ళేసరికి శేషేంద్ర తప్పక ఇంట్లో వుంటాడు. నాకెందుకో అలా అనిపిస్తోంది." - ధైర్యం చెప్పింది హెడ్‌మిస్ట్రెస్.

ఆమెకు థాంక్స్ చెప్పి - బయటకు నడిచాడు జగన్నాథం.

★ ★ ★

గడియారం మూడు గంటలు కొట్టింది.

జగన్నాథం ఆ శబ్దాలకు ఉలిక్కిపడ్డాడు. అతని కళ్ళల్లో దైన్యం కొట్టొచ్చినట్టు కనిపిస్తోంది.

"శేషేంద్ర రాలేదు కదూ?" - ఎదురుగా చేతులు కట్టుకుని నిలబడివున్న తోటమాలి మల్లయ్యనీ, వంటమనిషి సీతమ్మనూ చూస్తూ అడిగాడు.

ఆ ప్రశ్నకు జవాబులేనట్టుగా - వారిద్దరూ ఒకరి ముఖాలొకరు చూసుకొని, తలవంచుకున్నారు.... టెలిఫోన్ దగ్గరగా జరపుకున్నాడు జగన్నాథం. రిసీవర్ చేతిలోకి తీసుకొని పోలీస్‌స్టేషన్‌కి డయల్ చేశాడు.

"హలో... ఇన్‌స్పెక్టర్‌గారున్నారా?... అరుంధతీ స్పిన్నింగ్‌మిల్స్ ప్రొప్రయిటర్ జగన్నాథాన్ని !... యస్!... ఇంకా కనిపించలేదా? ఎట్లామరీ?.... మీ సబ్‌స్టేషన్స్‌కి కూడా తెలియచేయండి ! ప్లీజ్!" ఫోన్ పెట్టేసి - మళ్ళీ అంతలోనే ఏదో గుర్తుకొచ్చిన వాడిలా మరో నెంబర్ డయల్ చేశాడు.

"హలో... మేనేజరుగారా?... నేనేనండీ, జగన్నాథాన్ని!... ఇంకా లేదు... ఇప్పుడే అడిగాను... వాళ్లకీ దొరకలేదు...! మన వర్కర్స్ వచ్చేశారా?.. నో!... వీల్లేదు! మళ్ళీ ప్రయత్నించమనండి.. అందర్నీ తలో టాక్సీ తీసుకుని - సిటీ అంతా గాలించమనండి". రిసీవర్ని హుక్ మీద పెట్టేసి - సోఫాలో నిస్సహాయంగా వెనక్కి జార్లబడి కళ్లు మూసుకున్నాడు.

వంటమనిషి రెండడుగులు ముందు కొచ్చింది. "బాబుగారూ!" నెమ్మదిగా పిలిచింది.

కళ్ళు పూర్తిగా తెరవకుండానే - ఏమిటో చెప్పమన్నట్టు చూశాడు జగన్నాథం.

"అబ్బాయి గారు తప్పకుండా దొరుకుతారు! మీరు దిగులుపడకండి. మీ ఆరోగ్యం అసలే బాగాలేదు. భోజనం చేద్దురుగాని లేవండి. ఆలస్యమైపోయింది." -

ఆమె మాటలు కొంచెమైనా ఓదార్పు నివ్వకపోగా జగన్నాథాన్ని మరింత చిరాకు పరిచాయి.

"అవును! నేను కూడా, ఆలస్యమై పోతోందనే బాధపడుతున్నాను. పొద్దున్న పదకొండయ్యేసరికి ఇంటికి రావాల్సిన పసిబిడ్డ ఇంతవరకూ అయిపూ అజా లేకపోతే - మీకు చీమ కుట్టినట్టయినా లేదు. తప్పకుండా దొరుకుతాడనుకుంటూ చేతులు ముడుచుక్కూచుంటే, వచ్చి తలుపు కొట్టే వయసా వాడిది?... అసలు అరుంధతి బతికేవుంటే నన్నిలా నిలువనిచ్చేదా?' జగన్నాథం గొంతు వణుకుతోంది.

"అది కాదు బాబూ..." ఈసారి తోటమాలి ఏదో చెప్పబోయాడు. కానీ మరేం వినదల్చుకోలేనట్టు - అక్కణ్ణుంచి లేచేడు జగన్నాథం.

"బాబుగారు! తమరికి ఫోన్!" - అదేసమయంలో అక్కడికి హడావుడిగా వచ్చిన రంగయ్య చెప్పాడు.

జగన్నాథం ఆలోచనల్లో ఆశారేఖ తళుక్కున మెరిసింది...

'బహుశా పోలీసు స్టేషన్నించేవచ్చి వుండాలి ఫోన్!... శేషేంద్ర కనిపించి వుండాలి' అనుకుంటూ గబగబా హాల్లోకి వచ్చి రిసీవర్ అందుకున్నాడు.

"హలో!" అన్నాడు ఆత్రంగా.

"మీ అబ్బాయి ఇంటికి రాలేదని దిగులు పడుతున్నారు కదూ?" - అవతల్నించి వినిపించింది.

"ఔను... మీకు కనిపించాడా?" - ఆశగా అడిగేడు.

"కనిపించటం కాదు. నాదగ్గరే వున్నాడు. ఖంగారు పడకండి. ఓ రెండులక్షలు నాకిచ్చి- మీ అబ్బాయిని మీరు క్షేమంగా తీసుకెళ్లొచ్చు!" - ఆ గొంతులో కొంచెం కూడా మార్దవం లేదు.

"ఎవర్నువ్వు... బ్లాక్ మెయిల్ చేస్తున్నావా?" -

"నేనెవర్నో మీ కనవసరం!... మీరెలా అనుకున్నా ఫరవాలేదు. నాక్కావలసింది రెండులక్షలు! జస్ట్ టూ లాక్స్!... ఇరవై నాలుగు గంటలు టైం ఇస్తున్నాను... జాగ్రత్తగా వినండి!... ఇపుడు నాలుగవుతోంది. రేపు సాయంత్రం నాలుగంటల్లోగా ఆ డబ్బు కవరులో పెట్టి ఊరవతల చెరువు దగ్గర రావిచెట్టు తొర్రలో పెట్టి వెనక్కి తిరిగి చూడకుండా వెళ్లిపొండి!... మీరు ఇంటికి చేరేసరికి మీ శేషేంద్ర మీకు కనిపిస్తాడు... పోలీసు రిపోర్టిచ్చి నన్ను పట్టించాలని ప్రయత్నించారో - మీ శేషేంద్ర మీకు ప్రాణాలతో దొరకడు... మైండిట్!" అంతే!

అవతల డిస్‌కనెక్ట్ అయిపోయింది....!!

జగన్నాథం అక్కడే సోఫాలో కుప్పలా కూలిపోయాడు...

'వెయ్యి, రెండువేలూ కాదు... రెండు లక్షలు! అంతడబ్బు ఇవ్వటమా? విషయమంతా పోలీసులకు చెప్పటమా? బాబును కిడ్నాప్ చేసిన వ్యక్తి అసలు ఎవరైవుంటారో? తీరా రెండు లక్షలూ అక్కడెక్కడో పెట్టి వచ్చేశాక, ఇంట్లో తన శేషేంద్ర తనకు కనిపించకపోతే? అప్పుడేం చేయాలి?'- ఆలోచనలు ఈగల్లా ముసురు కుంటున్నాయి.

అలా నలభై నిమిషాలు నిశ్శబ్దంలో కలసిపోయాయి.... ఆ భయంకరమైన నిశ్శబ్దాన్ని చీల్చుకుంటూ 'సార్' అనే పిలుపు వినిపించటంతో తలెత్తి చూశాడు జగన్నాథం.

గుమ్మంలో ఓ యువకుడు కనిపించాడు. అంతవరకూ అతన్ని చేయిపట్టుకుని నిలబడివున్న శేషేంద్ర - తండ్రిని చూడగానే ఉత్సాహంగా 'డాడీ' అంటూ ఒక్క పరుగున వచ్చి తండ్రిని కౌగలించుకున్నాడు.

"వచ్చేశావా బాబూ!" అంటూ శేషేంద్రను ఎత్తుకుని ముద్దులవర్షం కురిపించాడు జగన్నాథం.

"ఎవడో రౌడీ నన్ను ఎక్కడికో ఎత్తుకుపోయాడు డాడీ! అదిగో ఆ అంకుల్ వాణ్ణి 'డిష్యూం డిష్యూం' అని తన్నేసి నన్ను తీసుకొచ్చేశారు" చెప్పాడు శేషేంద్ర.

ఇంకా గుమ్మం దగ్గరే వున్న ఆ యువకుడి వైపు మరోసారి చూశాడు జగన్నాథం, మహావుంటే అతనికి పాతికేళ్ళుండొచ్చు! తెల్లగా, పొడుగ్గా నాజుగ్గా వున్నాడు. అతను వేసుకున్న తెల్లని దుస్తులు బాగా నలిగిపోయి, అక్కడక్కడ మాసినట్టుగా మరకలతో కనిపిస్తున్నాయి. మనిషి కూడా కొంచెం అలసినట్టుగా వున్నాడు.

"థాంక్స్ బాబూ! నీ ఋణం ఈ జన్మకు తీర్చుకోలేను! కమిన్! కూర్చో!" అంటూ అతన్ని లోపలకు ఆహ్వానించి, సోఫా చూపించాడు జగన్నాథం.

"నీ పేరేమిటి?" అతను కూర్చున్న తర్వాత అడిగాడు.

"రాజశేఖరం!"

అంతలోనే అక్కడకు వచ్చిన సీతమ్మకు బాబుని అప్పగించి, అతనికి ఎదురుగా మరో సోఫాలో కూర్చున్నాడు జగన్నాథం.

"మా బాబు మీకు ఎక్కడ కనిపించాడు?" - క్షణం తర్వాత అడిగేడు.

"మా ఫ్రెండుతో మాట్లాడేందుకు - ఇంతకు ముందే పబ్లిక్‌ఫోన్ కోసం పోస్టాఫీస్‌కు వెళ్ళాను. నేను వెళ్ళేసరికి, లోపల ఒక వ్యక్తి అప్పటికే ఎవరితోనో మాట్లాడుతున్నాడు. అతని పక్కనే మీ బాబు కూడా వున్నాడు... బాబు ఏడుస్తూంటే, ఆ వ్యక్తి తన ఎడం చేత్తో గట్టిగా నోరుమూసి, బెదిరిస్తున్నాడు. నా కెందుకో అనుమానం వచ్చింది.... అతను ఫోన్లో మాట్లాడింతర్వాత బయటకు వచ్చి ఆటో ఎక్కేడు... నేను కూడా మరో ఆటో

ఎక్కి, అతన్ని వెంబడించాను, ఊరి చివర లేబర్‌కాలనీలో అతని ఆటో ఆగింది... తనను డాడీ దగ్గరకు తీసుకెళ్ళమంటూ మారాంచేస్తూన్న బాబుని, అక్కడున్న ఓ ఇంట్లోకి బలవంతంగా లాక్కుని వెళ్లాడు. బహుశా బాబుని కిడ్నాప్ చేసివుంటాడనిపించింది... క్షణం కూడా ఆలస్యం చేయకుండా నేను ఆ గదిలోకి వెళ్ళాను... 'ఎవరాబాబు' అని అడిగాను.. 'నీకనవసరం' అంటూ ఆ వ్యక్తి నా మీదకు వచ్చాడు. నేనతని ఛాతీ మీద తన్నేసరికి అతను దూరంగా వెళ్ళిపడ్డాడు...

".... అంతలో బాబు నా దగ్గరకు పరుగెత్తుకుంటూ వచ్చాడు... వీడు దొంగ... నన్ను ఎత్తుకొచ్చేశాడు... డాడీ దగ్గరకు తీసుకెళ్ళు అంకుల్! - అంటూ నా కాళ్ళను చుట్టేశాడు.. "అంతే! పరిస్థితి అర్థమైంది... వాణ్ణి మరో నాలుగు ఉతికి, బాబుని బయటకు తీసుకొచ్చాను. 'మీ ఇల్లెక్కడ బాబూ' అని అడిగాను. సరిగ్గా చెప్పలేకపోయాడు... కానీ తను చదువుతున్న కాన్వెంటు స్కూలు పేరు మాత్రం చెప్పగలిగాడు. వెంటనే, అదే ఆటోలో అక్కడకు వెళ్ళాను. అక్కడ హెడ్‌మిస్ట్రెస్ - మీ గురించి చెప్పి - ఎడ్రస్ ఇచ్చింది" - వివరంగా చెప్పాడు శేఖరం.

రంగయ్య రెండు కప్పుల్తో కాఫీ తెచ్చి వాళ్ళముందు పెట్టేడు.

"ఉద్యోగం ఎక్కడా?" - కాఫీ తాగుతూ అడిగాడు జగన్నాధం.

"ఇంకా లేదు సార్!... ప్రస్తుతం ఆ ప్రయత్నంలోనే ఉన్నాను!"

"ఏం చదివావ్?"

"బిఏ పాసయి నాలుగేళ్లు కావస్తోంది సార్... కనిపించిన పోస్టుకల్లా అప్లయ్ చేస్తున్నాను... కానీ ఫలితం మాత్రం కనిపించటంలేదు!" నిట్టూర్చాడు శేఖరం.

"మా ఆఫీసులో అసిస్టెంట్ పోస్టొకటి వేకెంటుగా వుంది... రేపొద్దునే వచ్చి అపాయింట్‌మెంటు ఆర్డర్స్ తీసుకో!"

శేఖరం పొంగిపోయాడు.

"థాంక్యూసార్!" కృతజ్ఞతా పూర్వకంగా చేతులు జోడించి నమస్కరించాడు...

"నో!... ఇందులో థాంక్స్ చెప్పవలసిన పనేముందీ? నిజానికి నీ ఋణం తీర్చుకోటానికే నా ప్రయత్నం!... నా బిడ్డని క్షేమంగా తీసుకొచ్చి అప్పగించావ్... నేనే థాంక్స్ చెప్పాలి!" - అన్నాడు జగన్నాథం.

తన లాల్చీజేబులోంచి పర్సుతీసి, అందులో వున్న వందరూపాయల నోట్లన్నీ బయటకులాగి శేఖరానికి ఇవ్వబోతూ మళ్లీ అన్నాడు -

"ఈ డబ్బుంచు!"

"వద్దుసార్! ఓ మంచి పనిచేశాననే తృప్తి నాకు మిగలనివ్వండి... అంతే చాలు... పైగా మీరు నాకు ఉద్యోగం కూడా ఇస్తున్నారు... అంతకంటే ఏం కావాలి?" - వినయం పుట్టిపడే స్వరంతో అన్నాడు శేఖరం.

"నీకు తెలీదుబాబూ! వాడెవడో రెండులక్షలు కావాలని, నన్ను బ్లాక్ మెయిల్ చేశాడు. సమయానికి దేవుడిలా, నువ్వేకనక అడ్డుపడకపోతే - ఆ డబ్బు వాడికి ఇచ్చుకునే వాణ్ణేగా?"

"దేవుడెప్పుడూ మంచివాళ్ళకి అన్యాయం చేయడుసార్! మీ మంచితనమే - మీ అబ్బాయిని క్షేమంగా మీ దగ్గరకు చేర్చింది!" చిరునవ్వుతో చెప్పాడు శేఖరం.

అతని గురించి మరికొన్ని వివరాలు తెలుసుకున్న తర్వాత, తన విజిటింగ్ కార్డ్ అతనికి అందిస్తూ అన్నాడు జగన్నాథం.

"రేపు ఎనిమిదింటికి - ఆర్డర్స్ నీ కోసం ఎదురు చూస్తుంటాయి!"

విజిటింగ్ కార్డుని జాగ్రత్తగా జేబులో పెట్టుకుని, మరోసారి జగన్నాథంకు కృతజ్ఞతలు చెప్పుకుని - శెలవు తీసుకున్నాడు శేఖరం.

★ ★ ★

అరుంధతీ స్పిన్నింగ్‌మిల్స్‌లో ఆఫీసు అసిస్టెంట్‌గా చేరిన రాజశేఖరం - ఏడాది తిరిగేలోగా పెళ్ళిచేసుకున్నాడు. రెండేళ్ళు గడిచేసరికి తండ్రి హోదాను సంపాదించుకున్నాడు... కేవలం అయిదేళ్ళ వ్యవధిలో రెండు ప్రమోషన్లు కూడా గెలుచుకున్నాడు.

"నువ్ అదృష్టవంతుడివోయ్' అని ఎవరైనా ఎప్పుడైనా అభినందిస్తే -

'ఈ అదృష్టానికి కారణం జగన్నాథంగారే! ఆయనలోని మంచిమనసే ఇవాళ నన్నీ స్థితిలో నిలబెట్టింది." - అని సగర్వంగా చెప్పుకునే వాడు.

కుటుంబ అవసరాలకు సరిపోగా ఓ వందరూపాయలు వెనకేసుకోవటానికి చాలినంత జీతం, అనుకూలవతియైన భార్య, అందమైన కొడుకూ, వాళ్ళిద్దర్నీ అడపాదడపా షికార్లు తిప్పటానికి ఓ స్కూటరూ, వీటన్నింటితో, అన్ని వేళలా - నలగని ఇస్త్రీ బట్టలతోటీ చెరగని చిరునవ్వులతోటీ కనిపించే శేఖరం - మూడు రోజుల్నించీ మరీ పిచ్చెత్తిన మనిషిలా కనిపిస్తున్నాడు. ఆఫీసుకి శెలవుపెట్టి ఊళ్ళో వున్న దేవుడిగుళ్ళ చుట్టూ తిరుగుతున్నాడు.

"జీతూ ఆరోగ్యం చక్కబడి, వాడు మళ్లీ మామూలు మనిషైతే ఆకుపూజలూ, అర్చనలూ అభిషేకాలూ చేయిస్తా" నంటూ ఆ దేవుళ్ళకు మొక్కుకుంటున్నాడు.

'జీతూ' అసలు పేరు జితేంద్ర... వాడికింకా మూడోఏడు రాలేదు... ముద్దుగా బొద్దుగా వుంటాడు. వాడు పుట్టిన తర్వాతనే రాజశేఖరానికి మొదటి ప్రమోషను వచ్చింది

ఉద్యోగంలో... కారణం అదికాకపోయినా, వాడంటే రాజశేఖరానికి వల్లమాలిన ప్రేమ! తను ఆఫీసునుంచి ఇంటికొచ్చేసరికి 'డాడీ' అంటూ వాడు ఎదురు రాకపోతే తనకు పిచ్చెక్కిపోతుంది.

జీతూకి జ్వరం వచ్చి పది రోజులు దాటిపోయింది. ముందు జలుబువల్ల ఒళ్ళు వెచ్చగా వుందనుకున్నారు... తర్వాత మామూలుజ్వరం కాబోలనుకున్నారు.. వారం రోజులు దాటినా తగ్గక పోయేసరికి అది టైఫాయిడ్ జ్వరమని నిర్ధారణ చేసి చెప్పాడు డాక్టరు.

అదేం పాడు జ్వరమో - రోజు రోజుకీ జీతూ అందాన్నీ ఆరోగ్యాన్నీ హరించేస్తోంది. బొద్దుగా కనిపించే పిల్లాడు పుల్లలా మంచాన్ని అతుక్కుపోయాడు. వాడి లేత ప్రాణాలు కళ్ళల్లో కొట్టు మిట్టాడుతున్నాయి... డాక్టరువచ్చి రోజూ ఇంజక్షను చేస్తూనే వున్నాడు.... మందులు రాస్తూనే వున్నాడు... అవన్నీ ఎలాంటి ఫలితాల్నీ ఇవ్వకపోయేసరికి శేఖరంలోని గుండెనిబ్బరం సన్నగిలిపోతోంది.... అందుకే దేవుడి మీద భారం వేశాడు.

రాజశేఖరం ఆఫీసుకి శలవు పెట్టిన కారణం తెలుసుకున్న జగన్నాథం ఆ రోజు సాయంత్రం వాళ్ళింటికి వచ్చాడు....

జగన్నాథాన్ని చూసేసరికి శేఖరానికి దుఃఖం ఉప్పెనలా ముంచుకొచ్చింది.

"డోంట్ వర్రీ మైబాయ్! చిన్నపిల్లాడిలా నువ్వే ఇంత అధైర్యపడితే ఎలా? ఈ డాక్టరు కాకపోతే మరో పెద్ద డాక్టరుకి చూపిద్దాం! ఎంత ఖర్చయినా నేను భరిస్తాను! ఒకనాడు నా కొడుకుని రక్షించి నా కెంతో సహాయం చేశావ్. నీ లాంటి మంచి మనిషికి ఆ దేవుడు అన్యాయం చేయడు. ధైర్యంగా వుండు, హీ విల్ బి ఆల్ రైట్!" అంటూ ధైర్యం చెప్పి వెళ్ళిపోయాడు జగన్నాథం.

అతని మాటలు శేఖరానికి కొంచెం కూడా ఓదార్పునివ్వకపోగా మరింత ఆవేదన కలిగించాయి...

పరుగెత్తుకెళ్ళి జగన్నాథం పాదాలమీద వాలిపోవాలని అనుకున్నాడు...

"సార్!... నన్ను క్షమించండి సార్! అయిదేళ్ళక్రితం, ఆనాడు మీ ఆఫీసులో ఉద్యోగం సంపాదించాలని నేను కావాలనే ఆ నాటకం ఆడేను! మా స్నేహితుణ్ణి బ్రతిమాలి స్కూల్లోంచి మీ బాబుని తప్పించి తర్వాత మిమ్మల్ని బ్లాక్‌మెయిల్ చేస్తూ పబ్లిక్‌బూత్ లోంచి ఫోన్ చేసే ఏర్పాటు చేశాను. మీ బాబుకి కూడా నమ్మకం కలిగేలా, అతనిముందే నా ఫ్రెండుని నాలుగు తన్ని తరువాత బాబుని తీసుకొచ్చి మీకు అప్పగించాను. మీ

అభిమానాన్ని సంపాదించుకున్నాను. మీలాంటి మంచిమనిషిని ఆనాడు అలా వంచించినందుకే ఇవాళ దేవుడు నాకీ శిక్ష విధించాడు" - అంటూ జరిగినదంతా చెప్పి తన తప్పుకి ప్రాయశ్చిత్తం చేసుకోవాలనుకున్నాడు...

కానీ

అడుగు ముందుకు పడక కన్నీటి పొరల్లోంచి, మంచం మీద వళ్ళు తెలియని స్థితిలో పడివున్న జీతూ వైపు జాలిగా చూశాడు.

"లేదు! ఆ దేవుడు నన్ను క్షమించడు" తనలో తనే గొణుక్కుంటూ చేతుల్లో ముఖాన్ని దాచుకున్నాడు రాజశేఖరం !!

(స్వాతి - సపరివార పత్రిక)

*16-11-1984*

★ ★ ★